క్లుప్తంగా

రోడ్లు, డ్రెయినేజీలు మరమ్మతు చేయించాలి


విరిగిపోయిన చెట్లను పరిశీలిస్తున్న జ్యోతి

జగిత్యాల: వర్షాలకు రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా అయ్యాయని, వెంటనే మరమ్మతు చేయించాలని, ప్రమాదకరమైన చెట్లు తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి ఆదేశించారు. సోమవారం పలు కాలనీల్లో పర్యటించి మాట్లాడారు. బైపాస్‌రోడ్‌లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, సెంట్రల్‌లైటింగ్ మధ్యలో ఉన్న చెట్లను, ధర్మపురిరోడ్‌లో ఇరువైపులా ఉన్న ప్రమాదకరమైన చెట్లను తొలగించాలన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీ వృక్షాలు, విద్యుత్‌స్తంభాలు నేలకొరుగుతున్నాయని, వెంటనే మరమ్మతు చేయించాలని విద్యుత్ అధికారులను కోరారు. ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి


నీటిని తొలగింపజేస్తున్న కమిషనర్

రాయికల్: నిల్వ నీటిని పారబోయాలని మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. పట్టణంలోని 1వ వార్డులోసోమవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పలు ఇళ్లలో ఉన్న నిల్వ నీటిని పారబోయించారు. నిల్వ నీటితో జర్వాలు వస్తాయన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

పట్టణంలోని 8వ వార్డులో సోమవారం కౌన్సిలర్ కల్లెడ సునీత ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సల్మాన్, ఆర్పీ అనూష, శానిటరీ ఆఫీసర్ రజాక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల: విద్యార్థులు భారతీయ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం భారతీయ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీవిద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై సూచించారు. నేరాల నియంత్రణలో విద్యార్థులు పోలీసులకు సహకరించాలన్నారు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోతె రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాశరథి శతజయంతి వేడుకలు


నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజశేఖర్ విద్యార్థులకు దాశరథి జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ,గాజెంగి రాజేశం, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు

దాశరథికి నివాళి

జగిత్యాల: దాశరథి శతజయంతిని పురస్కరించుకుని జగిత్యాలలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. త్వరలోనే అతని జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కవి సమ్మేళనం, కవితల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దెల సరోజన, అయిత అనిత, కవిత, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, గంగాధర్, శ్యామ్ సుందర్, సరళ, లావణ్య పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

కోరుట్ల కమిషనర్‌ను నిలదీసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్

మెట్‌పల్లి: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ప్రొటోకాల్ ఎందుకు పాటించడం లేదని పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కమిషనర్ మోహన్‌ను నిలదీశారు. చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన సోమవారం మున్సిపల్ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా సమాఖ్య భవన ప్రారంభాన్ని ఎందుకు వాయిదా వేశారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రశ్నించగా.. మంత్రి చేతుల మీదుగా ప్రారంభిద్దామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చెప్పారని బదులిచ్చారు. దీంతో కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే ఉండగా నర్సింగరావు మాట వినడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ తీరును ఎమ్మెల్యే తప్పుబడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అనంతరం సమావేశంలో 27 అంశాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల వ్యర్థాలను చెరువులో వేస్తున్నారని, దీనిని అరికట్టాలని 14వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య సూచించారు. కూరగాయల మార్కెట్‌లో చేపడుతున్న మాంసం విక్రయాలను శివారుకు తరలించాలని 18వార్డు కౌన్సిలర్ చెట్లపల్లి మీనా విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ నుంచి బదిలీపై వెళ్తున్న పలువురు ఉద్యోగులను ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: మండలంలోని వీరాపూర్, అల్లీపూర్ గ్రామాలకు చెందిన 11 మంది సీఎం రిలీఫ్‌ఫండ్ లబ్ధిదారులకు మంజూరైన రూ.25,500 విలువ గల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రజక సంఘం నాయకులు

జగిత్యాల: జగిత్యాల రజక సంఘం సభ్యులు ఈనెల 24న జరుగనున్న మడలేశ్వరస్వామి, వీరమ్మ బోనాల మహోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైభవంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్/ధర్మపురి/కథలాపూర్/పెగడపల్లి: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్లకు వినతిపత్రం అందించారు. కోరుట్ల, కథలాపూర్, పెగడపల్లి మండలాల్లో బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు ఆయా మండలాల తహసీల్దార్లకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల గనన చేసి ఆరు నెలల్లో బీసి రిజర్వేషన్లు పెంచుతామని గద్దెనెక్కిన ప్రభుత్వం 6 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయటం లేదన్నారు.ఇప్పటి వరకూ కుల గణన చేపట్టలేదన్నారు. బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 23 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాక్షుడు రుద్ర శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, లవన్‌కుమార్, బందారు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుమడ్ల చరణ్, ఆయా మండలాల బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఓబీసీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషి


ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సహకారంతో నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మండలంలోని రాఘవపేట శ్రీ మల్లన్న, మడేలయ్య స్వామి ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు రూ.10లక్షలు చొప్పున మంజూరు కాగా, సోమవారం గ్రామస్తులకు ఎమ్మెల్యే ప్రొసిడింగ్ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చొరవతోనే ఆలయాల అభివృద్ధికి టీటీడీ నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎండీ.అమిన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బైరి రాకేశ్ యాదవ్, బీఆర్‌ఎస్వీ నాయకులు బైరి రవికుమార్‌యాదవ్, స్థానిక నాయకులు, యాదవ, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సోమవారం 28 మంది లబ్ధి రులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకులు చీటి వెంకట్రావు, సింగిరెడ్డి నారాయణ రెడ్డి,కౌన్సిలర్లు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమాధికారిగా నరేశ్


కలెక్టర్‌ను కలిసిన నరేశ్

జగిత్యాల: జిల్లా సంక్షేమాధికారిగా బోనగిరి నరేశ్‌ను ఫుల్ అడిషనల్ చార్జిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ కోరుట్ల డీఎంగా మనోహర్

కోరుట్ల: ఆర్టీసీ కోరుట్ల డిపో నూతన మేనేజర్‌గా ఎన్. మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎం విజయ మాధురి కరీంనగర్ ఒకటో డిపోకు బదిలీ కాగా, ఆమె స్థానంలో సిరిసిల్ల డీఎం గా పనిచేస్తున్న మనోహర్ కోరుట్ల డీఎంగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు బదిలీపై వెళ్తున్న విజయ మాధురికి ఘనంగా వీడ్కోలు పలికారు. నూతన డీఎంను శాలువాతో సత్కరించారు.

బాధ్యతలు స్వీకరించిన మార్క్‌ఫెడ్ డీఎం

జగిత్యాలరూరల్: జగిత్యాల మార్క్‌ఫెడ్ డీఎంగా ఎండీ హబీబ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన దివ్యభారతి బదిలీపై వెళ్లగా జగిత్యాల డీఎంగా హబీబ్ బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా రవాణాశాఖ అధికారి బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లా రవాణా శాఖ అధికారి వంశీధర్‌ను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వంశీధర్ సిరిసిల్ల జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఫుడ్ సెక్యూరిటీ అధికారుల తనిఖీ

మల్యాల: మండల కేంద్రంలోని పలు బేకరీలతోపాటు, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా బేకరీలో కాలం చెల్లిన బ్రెడ్, బిస్కట్ ప్యాకెట్లను పడేశారు. అనంతరం గురుకుల పాఠశాలలోని హాస్టల్‌లోని కిచెన్‌ను పరిశీలించారు. మురిగిపోయిన ఉల్లిగడ్డలు పడేయాలని మెస్ వద్ద మెనూ చార్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

కోరుట్ల: పీడీఎస్‌యూ రాజకీయ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో వస్తున్న మార్పులపై, విద్యారంగ సమస్యలపై , ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ హామీలు, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

జగిత్యాల: అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని ఉద్యమకారుల జిల్లా ఫోరం చైర్మన్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం మాట్లాడారు. ఉద్యమకారులకు కేటాయిస్తామన్న 250 గజాల స్థలం, పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సుతో పాటు, ఆరోగ్య కార్డు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మరాఠి గంగారెడ్డి, రాగుల రాజు, మెరుగు గంగ, చింత గంగాధర్, సురేశ్, రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఈత, తాటిచెట్లు తొలగించిన వారిపై చర్యలేవీ?

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలో ఇటీవల ఈత, తాటిచెట్లు తొలగించారని ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌కు, జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవికి గీతకార్మికులు ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు దుండగులపై చర్యలు తీసుకోలేదని గీతకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ

వెల్గటూర్ : వెల్గటూర్ మండలంలోని మిల్లులను జగిత్యాల జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరుణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారులు తనిఖీ చేశారు. సంకెనపల్లి శివారులోని అన్నదాత, సాయిసుధ మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. 2022–23 రబీ, 2023–24 ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం ఎంత..? ప్రభుత్వానికి సీఎంఆర్ ఇచ్చింది ఎంత..? ఇవ్వాల్సింది ఎంత..? ప్రస్తుతం రైస్‌మిల్లుల్లో ఉన్న నిల్వలు ఎంత అని తనిఖీలు చేపట్టారు. అన్నదాత రైస్‌మిల్లులో 7,231 క్వింటాళ్ల ధాన్యం తేడా ఉన్నట్లు గుర్తించారు. సాయిసుధ రైస్‌మిల్లులో 3,120 క్వింటాళ్ల ధాన్యం తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిల్లుల యాజమాన్యం నుంచి రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఆర్ఐ రాజేశ్వరి పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ


విద్యార్థుల అభ్యాసనను పరిశీలిస్తున్న ఎంఈవో

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల విద్యాధికారి భీమయ్య అన్నారు. మండలంలోని గొర్రెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి రికార్డులు, అమ్మ ఆదర్శ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన ప్రక్రియను పరిశీలించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మనగర్‌లో ఓ చిన్నారిపై వీధికుక్క దాడి చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, గ్రామంలో ఇంటింటికి వెళ్లి వీధి,పెంపుడు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటికీ పంపొద్దని, వారిపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉండాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కుక్క కాటుకు గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కృష్ణవేణి, ఏఎన్‌ఎం వసంత,సూపర్‌వైజర్ అచ్యుత్‌రావు,కార్యదర్శి నిజామొద్దీన్ పాల్గొన్నారు.

చెరువు కట్టకు మరమ్మతు చేయాలని వినతి

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువు కట్టను మరమ్మతు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ పిప్పోజి మహేందర్‌బాబు తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద చెరువు కట్ట వద్ద నాలుగు చోట్ల కొట్టుకుపోయిందని, వెంటనే మరమ్మతు చేయాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ధర్మపురి: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు అన్నారు. పట్టణంలోని అక్కపెల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం సమీపంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 30 పండ్లు, పూల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఏదో ఒక ఆలయ ఆవరణలో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కరీంనగర్ జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ అల్లం దుర్గాప్రసాద్, జిల్లా ప్రముఖ్ కస్తూరి రాజన్న, నగర అధ్యక్షుడు ముత్యపు రమేష్, మండల అధ్యక్షుడు మామిడాల రవీందర్, వెలుగందుల బుచ్చన్న, ఆలయ చైర్మన్ సీపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న మంచాల కృష్ణ

జగిత్యాల/కోరుట్ల: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జగిత్యాలకు చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19 నుంచి21 వరకు బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జగిత్యాలకు చెందిన క్రీడాకారులు హంసిక, ఆరాధ్య, మహిజ ,శివమణి, అక్షయ, సమీక్ష, నిహార, సదృశ్ నాలుగు బంగారు, ఒక సిల్వర్, నాలుగు కాంస్యలతో మొత్తం 9 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి శ్రీహరి, జాయింట్ సెక్రటరి శ్రీధర్, సుదీర్, జగిత్యాల జిల్లా అసోసియేషన్‌చైర్మన్ మంచాలకృష్ణ, కోచ్‌లు సోయబ్, రమేశ్ అభినందించారు.

కోరుట్ల పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ కు చెందిన 6వ తరగతి విద్యార్థి శివమణి జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గుజ్జేటి వెంకటేశ్ సోమవారం తెలిపారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

రుణమాఫీ కాలే..


ఏవో కార్యాలయంలో రైతులు

కథలాపూర్: తమ పంట రుణం మాఫీ కాలేదని పలువురు రై తులు మండలకేంద్రంలో వ్యవసాయ అధికారులకు సోమవారం విన్నవించారు. రుణమాఫీ జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ కాలేదని కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. తాము రూ. 1 లక్ష లోపు రుణం తీసుకున్నా మాఫీ కాలేదని, మరికొందరు వాపోయారు. రుణమాఫీ కాకుంటే రైతులు తమ బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, పట్టదారు పాసుబుక్కుల జిరాక్స్‌తో ఏఈవోలను సంప్రదించాలని ఏవో యోగితా తెలిపారు.

కలెక్టర్‌కు వినతి

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మైనర్ ఐదు నెలల క్రితం అత్యాచారానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. ఇప్పటికీ బాధితురాలికి న్యాయం జరగలేదని సోమవారం వెంకట్రావుపేటకు చెందిన బుడగజంగాల నాయకులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఘటనపై విచారణ జరిపి బాలికకు తగిన న్యాయం చేయాలని కోరారు. న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్ తెలిపారు.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం

జగిత్యాల: ఇంటింటా ఇన్నోవేటర్ ద్వారా గ్రామీణప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. గ్రామీణ ఆవిష్కకర్తలు అద్భుతమైన ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించాలని, మంచి ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15న అవార్డులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆవిష్కరణల దరఖాస్తులను వాట్సాప్ నంబర్ 9100678543కు పంపించవచ్చని పేర్కొన్నారు. డీఈవో జగన్మోహన్ రెడ్డి, సైన్స్ అధికారి రాజశేఖర్, నోడల్ అధికారి నారాయణ, బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, చిత్రు, మమత, జలేందర్ పాల్గొన్నారు.

ఏడీకి సత్కారం

జగిత్యాల: జగిత్యాల విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శివకృష్ణ డైరెక్టర్ ఆఫ్ స్కూల్‌ఎడ్యుకేషన్ హైదరాబాద్ బదిలీ కాగా, సోమవారం పీఆర్టీయూ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, కార్యదర్శి ఆనందరావు పాల్గొన్నారు.

ఇసుక వేలంపై నిర్లక్ష్యం


మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుక కుప్పలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇసుక కుప్పలు పేరుకుపోతున్నాయి.అనుమతులు లేకుండా వాగుల్లో నుంచి తరలించిన ఇసుకను పోలీస్,రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు.అయితే పట్టుబడ్డ ఇసుకకు రెవెన్యూ అధికారులు వేలం వేయాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యంతో నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం బయట ఇసుక కుప్పలు ఉండిపోతున్నాయి. ఉన్నతధికారులు దృష్టి సారించి త్వరగా వేలం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు.మొత్తం ఎనిమిది మంది కార్యదర్శులు బదిలీ కాగా,సోమవారం వారంతా అధికారులకు రిపోర్టు చేశారు. చెర్లకొండాపూర్ కార్యదర్శి హరీశ్ ఓబులాపూర్ తండాకు, బండలింగాపూర్ కార్యదర్శి శ్రీనివాస్ మల్లాపూర్‌కు, పెద్దాపూర్ కార్యదర్శి వినిత రేగుంటకు, ఆత్మకూర్ కార్యదర్శి ఆసిఫ్ పెద్దాపూర్‌కు, పాటిమీదితండా కార్యదర్శి రాణప్రతాప్ కోనరావుపేటకు, కొండ్రికర్ల కార్యదర్శి హేమలత చింతలపేటకు, కోనరావుపేట కార్యదర్శి రాజ్‌కుమార్ కొండ్రికర్లకు, చింతలపేట కార్యదర్శి నవీన్ యామాపూర్‌కు బదిలీ అయ్యారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని 9 గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వర్షకొండ గ్రామ కార్యదర్శిగా పనిచేసిన రాకేశ్, కొజన్‌కొత్తూర్‌కు బదిలీ కాగా, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామకార్యదర్శి దొడ ప్రవీణ్‌కుమార్ వర్షకొండకు బదిలీ అయ్యారు. కొజన్‌కొత్తూర్ కార్యదర్శి ప్రసాద్ మూలరాంపూర్‌కు, మూలరాంపూర్ కార్యదర్శి గంగలక్ష్మణ్ కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌కు, ఫకీర్‌కొండాపూర్ గ్రామకార్యదర్శి యం. సరిత అమ్మక్కపేటకు బదిలీ కాగా , అమ్మక్కపేట కార్యదర్శి రాజశేఖర్ ఫకీర్‌కొండాపూర్‌కు బదిలీ అయ్యారు. డబ్బా కార్యదర్శి రాణి కేశాపూర్‌కు, మల్లాపూర్ మండలం ఓబులాపూర్ తాండ కార్యదర్శి రవళి డబ్బాకు బదిలీ అయ్యారు. యామపూర్ కార్యదర్శి దివాకర్, బర్థిపూర్ బదిలీ కాగా, మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామకార్యదర్శి నవీన్ యామాపూర్‌కు బదిలీ అయ్యారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సారంగాపూర్: కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారులు తిరుపతినాయక్, అనూష పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

రాయికల్ : మండలంలోని మూటపల్లికి చెందిన మ్యాకల భూమరాజు (45)ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై అశోక్ తెలిపారు. భూమరాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుందని ఎస్సై పేర్కొన్నారు.

వెల్డింగ్ షాప్‌లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని వేంపేట రోడ్‌లో ఉన్న రహాన్ వెల్డింగ్ వర్క్‌షాపులో దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళితే...వర్క్‌షాపు నిర్వహకుడు ఫిరోజ్ ఆదివారం రాత్రి 10 గంటలకు పని ముగిసిన తర్వాత మూసివేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూడగా..నాలుగు సీసీ కెమెరాలతో పాటు ఇతర సామగ్రి, రూ.10వేల నగదు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో సోమవారం ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా పట్టణ ఎస్సై తిరుపతి దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.27,370 స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.